రేపు పర్యావరణంపై భారీ ర్యాలీ

జగ్గయ్యపేట అర్బన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే నినాదంతో ఈనెల 28 వ తేదీన జగ్గయ్యపేట పట్టణంలో పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సెయింట్ ఆన్స్ అమెరికన్ హాస్పిటల్ అనుబంధ సంస్థ సర్వజన స్నేహ చారిటబుల్ ట్రస్ట్ పేట ప్రతినిధులు సిస్టర్ నిర్మల, ఫెలిస్ట తెలిపారు. స్థానిక ట్రస్ట్ సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ర్యాలీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నందిగామ: పట్టణ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టులకు ఎస్ఎస్సీ విద్యార్హత కలిగి 18 సంవత్సరాలు పైబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సైట్ ద్వారా ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించవచ్చునన్నారు.

ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకున్న సీఎం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పొన్నవరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పొన్నవరం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలనే సమున్నత లక్ష్యంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ జ్ఞానరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూలై 24 నుంచి సంగీత కళాశాల వార్షిక పరీక్షలు

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల వేదికగా 2022–2023 సంవత్సరానికి జూలై 24 నుంచి సంగీతంలో వివిధ అంశాలపై వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ సర్టిఫికెట్ కోర్స్ పేపర్ 1, 25న డిప్లొమా వారికి పేపర్ 1, 26న పేపర్ 2, 27 నుంచి అన్ని విభాగాల వారికి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలి



పేటలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ జానకీరామ్



నందిగామ గాంధీ సెంటర్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ జనార్ధననాయుడు

నందిగామ: యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని ఏసీపీ జనార్ధన నాయుడు సూచించారు. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పలు కళాశాలల విద్యార్థులతో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, గాంధీ సెంటర్ లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఏసీపీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ హనీష్, సెబ్ సీఐ ఇంద్రజిత్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

నందిగామటౌన్: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. విజయవాడకు చెందిన డాన్‌బోస్కో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవించటం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ మేరుగు రత్నం, రాటకొండ రామకోటేశ్వరరావు, పారుపల్లి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

జగ్గయ్యపేటఅర్బన్: అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణ పోలీసులు మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పేట సీఐ జానకీరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ర్యాలీ స్థానిక కమలా సెంటర్ నుంచి బలుసుపాడు రోడ్ వరకు నిర్వహించారు. విశ్వభారతి తదితర వివిధ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణ ఎస్ఐ బీవీ రామారావు, ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు, సెబ్ సీఐ జి.శ్రీనివాసరావు, సెబ్ ఎస్ఐలు, సిబ్బంది, ఆటో వర్కర్లు, ముఠా వర్కర్లు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో జీవితం అంధకారం

కంచికచర్ల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని దక్కించుకుంటారని లేకపోతే జీవితాలను అంధకారంలోకి నెట్టివేయబడతాయని ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ మేరుగ రత్నం, ఏఎస్ఐ దుర్గారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పకడ్బందీగా జగనన్న సురక్ష

పెనుగంచిప్రోలు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి అన్నారు. కార్యక్రమానికి సంబంధించి సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథుల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం మొదటి రోజు మండలంలోని పెనుగంచిప్రోలు–1, అనిగండ్లపాడు–1 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల ఉచిత సేవల గురించి వివరించాలన్నారు. అర్హత ఉన్న ఏవ్యక్తి ప్రభుత్వ పథకాలు పొందకుండా ఉండకూడదనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. లబ్ధిదారులు తమ సమస్యలను తెలియజేయగానే జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన లాగిన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జగనన్న సురక్ష సర్వే



బూదవాడలో సర్వే చేస్తున్న సిబ్బంది

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామాల్లోని సమస్యలను పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో సోమవారం పలు గ్రామాల్లో సర్వే చేశారు. గౌరవరం, బూదవాడ గ్రామాల్లో ఈవోపీఆర్డీ సాంబశివరావు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తిస్తున్నారని తెలిపారు. అన్ని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. అందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

నందిగామ: కడుపునొప్పి తాళలేక ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం నందిగామ పట్టణంలో జరిగింది. ఎస్ఐ పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని భారత్ టాకీస్ ప్రాంతానికి చెందిన గ్రంథసిరి పుల్లయ్య (27)కు కొంతకాలంగా తరచూ కడుపునొప్పి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 30 వ వార్డు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం పక్కన రూ.3 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజ్ నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా అన్ని వార్డుల్లో డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పందుల రోశయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు మోరె వినోద్, వత్సవాయి వైస్ ఎంపీపీ కొలిపోగు వెంకటేశ్వర్లు, చిల్లకల్లు నాగబాబు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజు వసూళ్లను నియంత్రించాలి

కంచికచర్ల: ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కంచికచర్లకు చెందిన ప్రజలు స్పందనలో అర్జీ దఖలు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. స్పందనలో సమస్యలు పరిష్కారం కోరుతూ మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. వాటిలో ప్రవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయటంతో పాటు పుస్తకాలు ప్రింట్‌చేసి విక్రయించి లక్షలు దోచుకుంటున్నారని, పాఠశాలల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని ఒక అర్జీ, పట్టాదార్ పాసుపుస్తకాలు కావాలని రెండు అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఏఓ కె.విజయకుమార్, ఏపీఓం కోట భాస్కరరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: హత్యాయత్నం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 12వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు సోమవారం తీర్పు చెప్పారు. ఎనికేపాడులో నివసిస్తున్న నిందితుడు షేక్ మహబూబ్ బాషా తన ఇంటి సమీపంలో ఉండే ఫిర్యాదిపై కత్తితో దాడి చేశాడు. వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఉద్దేశంతో బాధితుడిపై నిందితుడు దాడి చేశాడు. బాధితుడి చెయ్యిపై బలమైన గాయాలయ్యాయి. 2015 జూన్ 11న జరిగిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పటమట పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజుల తరువాత నిందితుడుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గద్దం జయరామ్ కోర్టులో వాదనలు వినిపించారు. 10 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు బాషాకు జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డుల అందజేత



నగదు రివార్డ్‌ను అందించి అభినందిస్తున్న సీపీ రాణా

విజయవాడ స్పోర్ట్స్: ఇటీవల జరిగిన చోరీ కేసులను చాకచక్యంగా ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సోమవారం అభినందించి నగదు రివార్డు అందజేశారు. పటమట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన చోరీ కేసుల్లో నిందితులను త్వరగా అదుపులోకి తీసుకుని రూ. 27.50 లక్షల నగదుతో పాటు భారీగా బంగారం, వెండి ఆభరణాలను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన క్రైంఏడీసీపీ పి.వెంకటరత్నం, ఏసీపీ సీహెచ్ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐలు ఎం.రామ్‌కుమార్, వై.రవికుమార్, పి.కృష్ణ, ఎస్ఐలు పి.కిషోర్, కె.నాగేశ్వరరావు, జి.కృష్ణారావు, ఏఎస్ఐలు సి.హెచ్.సత్యనారాయణ, బి.వి.స్వామి, ఎస్.కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుళ్లు కె.ప్రవీణ్‌కుమార్, జె.నాగరాజు, ఎం.ప్రకాశరావు, కానిస్టేబుళ్లు పి.అవినాష్, ఎం.సురేష్, జి.సురేష్, ఎం.ఎస్.నారాయణ, ఎ.దుర్గాకుమార్, ఎం.పూర్ణచంద్రరావు, టి.అప్పలరాజు, పి.రాంబాబు, షేక్ షబ్బీర్, వి.వి.రమణ, ఎ.వి.సుబ్బారావుకు రివార్డు అందించి అభినందించారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

వీరులపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. వీరులపాడులోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్‌లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని గృహాలకు వెళ్లి జగనన్న సురక్షపై అవగాహన కలిగించటంతో పాటు సమస్యలను తెలుసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, ఎంపీడీవో అరుంధతీ దేవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష బృందాల ఏర్పాటు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూలై ఒకటినుంచి చేపట్టే జగనన్న సురక్ష కా ర్యక్రమంలోభాగంగా మండలంలో రెండు బృందాలను ఏర్పాటుచేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్ర సాద్ సోమవారం తెలిపారు. టీం–1 జూలై ఒకటిన బూదవాడ, నాలుగున అనుమంచిపల్లి, ఆరున అన్నవరం, 11న చిల్లకల్లు, 13న బలుసుపాడు, 15న బండిపాలెం, 18న తక్కెళ్లపాడు, 20న తిరుమలగిరి, 22న వేదాద్రి, 25న ధర్మవరప్పాడుతండా గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తాయన్నారు. టీం–2 జూలై ఒకటిన గౌరవరం, నాలుగున గండ్రాయి–1, ఆరున గండ్రాయి - 2, 11న జయంతిపురం, 13న కె.అగ్రహారం, 15న మల్కాపురం, 18న ముక్త్యాల, 20న పోచంపల్లి, 22న షేర్‌మహ్మద్‌పేట–1, 25న షేర్‌మహ్మద్‌పేట–2 గ్రామ సచివాలయాల్లో శిబిరాలు జరుపుతాయని తెలిపారు.

పాఠశాలకు క్రీడా పరికరాలు వితరణ

నందిగామ: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్ఎల్ నరసింహారావు రూ.15 వేల విలువచేసే పలు రకాల క్రీడా పరికరాలను అందజేశారు. ఆయన సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావును ఘనంగా సత్కరించారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

కీసర(కంచికచర్ల): క్రైస్తవులపై అరాచక శక్తులు దాడులు చేస్తున్నాయని, అటువంటి వారిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని పాస్టర్ల ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు పాస్టర్ పీటర్ అన్నారు. మండలంలోని కీసర మన్నా ప్రార్థనా మందిరంలో సోమవారం నియోజకవర్గ పాస్టర్ల సమావేశం జరిగింది. ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ మార్కపూడి డేవిడ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు జయరాజు, కమలాకర్, యోహాన్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

బాలుర హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని వందేళ్ల చరిత్ర కలిగిన జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు 60 కుర్చీలను వితరణగా అందజేశారు. 1996–97 వ సంవత్సరం 10 వ తరగతి పూర్వ విద్యార్థి అయిన శ్రీరాం వివేక్ స్కూల్ హెచ్ఎం మాధవీలతకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో పూర్వ విద్యార్థి వివేక్‌ను, అతనిని ప్రోత్సహించిన వారి సహోధ్యాయుడు, షేర్‌మహ్మద్‌పేట హైస్కూల్ ఉపాధ్యాయుడు పి.కనకరాజు పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. హెచ్ఎం మాధవీలత, స్టాఫ్ సెక్రటరీ షేక్ మౌలాలి, జాయింట్ సెక్రటరీ కరుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

నందిగామ: విద్యార్థులు ఎటువంటి దురలవాట్లకు లోనవకుండా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పట్టణంలోని అడిషనల్ జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి షేక్ రియాజ్ సూచించారు. అంతర్జాతీయ డ్రగ్స్ ఎగెనెస్ట్ అబ్యూస్ డే సందర్భంగా పట్టణంలోని అక్షర కళాశాలలో సోమవారం సాయంత్రం విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరూ సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలి

పెనుగంచిప్రోలు: కౌలు రైతులందరూ తప్పకుండా పంట సాగు హక్కుదారుల పత్రం(సీసీఆర్‌సీ) కార్డులు తీసుకోవాలని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి అన్నారు. స్థానిక సచివాలయంలో సోమవారం కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్డు తీసుకోవటం వలన ప్రభుత్వం నుంచి వచ్చే అన్నిరకాల పథకాలు అందుతాయన్నారు. భూయజమానులు కూడా కౌలుదారులకు కౌలు కార్డు ఇవ్వటానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, ఏఓ సిద్ధారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సీఐ, హోంగార్డు

గుడివాడ రూరల్ సీఐ కార్యాలయంపై ఏసీబీ దాడులు



ఏసీబీకి పట్టుబడ్డ సీఐ జయకుమార్, హోంగార్డు మహ్మద్ సనాఉల్లా

గుడివాడరూరల్: గుడివాడ రూరల్ సీఐ, హోంగార్డు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. గుడివాడరూరల్ పరిధిలో ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఫ్లెక్సీలు ముద్రించిన ఇమేజ్ డిజిటల్స్ నుంచి లంచం డిమాండ్ చేసిన గుడివాడ రూరల్ సీఐ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. దాడుల్లో రూ.75 వేలు లంచం తీసుకుంటున్న సీఐ కేఎన్వీ జయకుమార్, హోంగార్డు మహ్మద్ సనాఉల్లాను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే ఇటీవల గుడివాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. ఆ సమయంలో పర్యటనకు వ్యతిరేకంగా, టీడీపీకి అనుకూలంగా ఫ్లెక్సీలు ముద్రించిన ఇమేజ్ డిజిటల్స్ ప్రతినిధులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇమేజ్ డిజిటల్స్ అధినేత కందుల రవిని కేసు నుంచి తప్పించాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని రూరల్ సీఐ జయకుమార్ అడిగి బెదిరించారు. దీంతో బాధితుడు కందుల రవి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ ఎం.స్నేహిత ఆధ్వర్యంలో అధికారులు గుడివాడ రూరల్ సీఐ కార్యాలయంపై దాడులు నిర్వహించారు. దాడుల్లో బాధితుల నుంచి సీఐ జయకుమార్ మొదటి విడతగా రూ.75వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీంతో సీఐని అదుపులోకి తీసుకుని అతనికి సహకరించిన హోంగార్డు మహ్మద్ సనాఉల్లాను అధికారులు అరెస్ట్ చేశారు. నిందితులను ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. దాడుల్లో ఏసీబీ డీఎస్పీలు బి.శ్రీనివాస్, పి.శరత్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఎన్నిక

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ సంఘ ఎన్నికలు సోమవారం విజయవాడలోని డీఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. అధ్యక్షులుగా పి.అంకమ్మ, కార్యదర్శిగా పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బి.లక్ష్మీనారాయణ, ఎం.సాంబశివరావు, జె.ఎస్.శంకర్‌గుప్తా, ఆర్.రామ్మోహన్, ఎం.మోహన్‌రావు, ఇ.త్రిమూర్తి, వి.హరికృష్ణ, పి.ఎస్.శాస్త్రి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.ఎస్.ఎన్.ప్రసాద్, డి.ధనలక్ష్మి, కె.శివశిల్ప, ఆర్.సంపత్ కుమార్, సి.హెచ్.గంగాధర్, వై.వి.ఆర్.కె.ప్రసాద్, కె.సాయిసందీప్, కోశాధికారిగా దుర్గాప్రసాద్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా హైకోర్టు న్యాయవాది పి.రామకృష్ణ, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా హైకోర్టు న్యాయవాది టి.దుర్గారావు, అబ్జర్వర్లుగా ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) బ్యాడ్మింటన్ కోచ్ కె.భాస్కర్, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి ఎం.వంశీకృష్ణ వ్యవహరించారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నైనవరం ఫ్లై ఓవర్‌పై జరిగిన గోగుల నాగమణి హత్య కేసులో నిందితుడు కుంభా రాజేష్‌ను కొత్తపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సోమవారం ఉదయం నిందితుడు రామరాజ్యనగర్ కట్ట రోడ్డులో ఉన్నాడనే సమాచారంపై సీఐ సుబ్రహ్మణ్యం స్టేషన్ సిబ్బంది అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, జూలై 7వ తేదీ వరకు రిమాండ్ విధించారు. నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.


పారామౌంట్
సురేష్ అన్నకు
జన్మదిన శుభాకాంక్షలు
నిస్వార్థ సమాజ సేవకులు, ఎందరికో ఆదర్శప్రాయులు, ఆపదలో ఉన్నవారికి
తనవంతుగా సాయం చేసే మంచి మనసున్న మనిషి, నిగర్వి
పారామౌంట్ గ్రూప్స్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత
శ్రీ వెనిగళ్ళ సురేష్ గార్కి
మరియు వారి తనయుడు ఉన్నతమైన భావాలు ఉన్న యువ పారిశ్రామికవేత్త
శ్రీ వెనిగళ్ళ సాయితేజ ప్రీతమ్ గార్కి
ఇవే మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు...
కొడాలి వెంకట శ్రీధర్
ప్రముఖ పారిశ్రామికవేత్త, విజయవాడ
గూడపాటి శ్రీనివాసరావు
Ex-MPP, పెనుగంచిప్రోలు
కనగాల శ్రీనివాసరావు
Vice MPP, పెనుగంచిప్రోలు, కొనకంచి
గింజుపల్లి శ్రీనివాసరావు
ఛైర్మన్, G.V.R., ఫౌండేషన్ - నవాబుపేట
గద్దె సుధీర్‌కుమార్
శ్రీ వెంకటసాయి హోటల్స్, జగ్గయ్యపేట
కుంటముక్కల వెంకట శివకృష్ణ
కాంట్రాక్టర్ & ట్రాన్స్‌పోర్ట్ తోటచర్ల
కునుగుంట్ల సాంబశివరావు
YSRCP నాయకులు, తోటచర్ల
ఆరిమండ వేణుగోపాలరెడ్డి
New ERA స్కూల్స్, హైదరాబాద్
తులసీదాస్
Bread Box, విజయవాడ
మాగంటి శివపూర్ణచంద్రరావు
ట్రాన్స్‌పోర్ట్ & ట్రేడింగ్, విజయవాడ
కనపర్తి రాంబాబు
BVMC ట్రేడింగ్ కంపెనీ - VJA
ముప్పసాని కృష్ణ
ట్రాన్స్‌పోర్ట్ & ట్రేడింగ్ - VJA
చెరుకూరి సీతారామయ్య
సీనియర్ కాంగ్రెస్ నాయకులు
కిలారు జయరామ్
సీనియర్ న్యాయవాది - విజయవాడ
మాగంటి శ్రీనివాసరావు (చిన్ని)
MIC కాలేజ్ యాజమాన్యం
ఉప్పుటూరి బసవయ్య
విజయవాడ